అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చెలరేగిపోతున్న గంజాయి బ్యాచ్
- కొరవడిన పోలీసుల నిఘా


సింగ్‌నగర్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): అజిత్‌సింగ్ నగర్‌లో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. నిత్యం పదుల సంఖ్యలో ఇక్కడ యువకులు గంజాయి, మద్యం సేవించడం గొడవలకు దిగడం పరిపాటిగా మారింది. కోడికూతకు ముందే ఇక్కడ ఖాళీగా ఉన్న అపార్టుమెంట్లలో గంజాయి బ్యాచ్ గుంపులుగా చేరి గంజాయి, మద్యం సేవించడం ఆ మత్తులో గొడవలు పడటమే కాకుండా అటుగా వచ్చే వారిపై దాడులకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

రాత్రి, పగలు తేడా లేదు

గంజాయి బ్యాచ్ చేసే ఆగడాలకు రాత్రి, పగలు తేడా లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. నడి రోడ్లపైనే కూర్చొని గంజాయి, మద్యం సేవిస్తున్నారు. ఇక్కడి రామానగర్‌కాలనీలో అధిక శాతం ఖాళీ ప్లాట్‌లు ఉండటంతో వాటిని అసాంఘిక శక్తులు తమ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చుకున్నారు. చీకటి పడితే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచార కార్యక్రమాలకు పాల్పడుతున్నారని దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు.

నిత్యం అల్లర్లు, గొడవలు

కాలనీలో నిత్యం అల్లర్లు, గొడవలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి అయితే నిద్రపట్టని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే యువకులు ఆటోలు, బైకులపై ఇక్కడికి చేరుకుంటారు. ఈ ప్రాంతంలో పోలీసుల నిఘా లేకపోవడం, సరైన చర్యలు తీసుకోకపోవడంతో గంజాయి బ్యాచ్ చెలరేగిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ జరిగే కార్యక్రమాలపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బయటకు రాలేకపోతున్నాం

గంజాయి, మద్యం సేవించి యువకులు చేసే గొడవలతో ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోతున్నాం. వారిని ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది.

జయప్రద, స్థానికురాలు

ప్లాస్టిక్ నిషేధం ప్రజల సహకారంతోనే సాధ్యం

మేయర్ భాగ్యలక్ష్మి


ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం ప్రజల సహకారంతోనే సాధ్యమని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వన్‌టౌన్, పంజాసెంటర్‌లో శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజల సహకారంతో దేశంలోనే ఉత్తమ స్థానాలను స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్‌ను నగరపాలకసంస్థ అందుకుందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు శ్రమిస్తూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం అభినందనీయమని అన్నారు. కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించారని సూచించారు. సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ పర్యావరణానికి హాని కలిగిస్తాయని, భూమిలో కలవడానికి కొన్ని వందల ఏళ్లు పడుతుందని తెలిపారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకూడదని చెప్పారు. అనంతరం వన్ ఎర్త్–వన్ లైఫ్ వారు పెట్టిన ప్రత్యేక స్టాల్‌ను వీక్షించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరిండెంటింగ్ ఇంజినీర్లు పీ సత్యనారాయణ, పీ సత్యకుమారి, వన్ ఎర్త్–వన్ లైఫ్ అడ్మిన్ లీలాకుమారి బందం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా భావిస్తేనే, ఆరోగ్యకరమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం శానిటరీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి, శానిటరీ సిబ్బంది

అనంతరం శానిటరీ సిబ్బంది వ్యర్థాల విభజన, కంపోస్టు ఎరువుల తయారీ, ప్లాస్టిక్‌తో కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో...

స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది, పాఠకులు కలిసి గ్రంథాలయ పరిసర ప్రాంతాలు, పుస్తకాల ర్యాకులను శుభ్రపరిచారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, పాఠకులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో....

ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం స్వచ్ఛ స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్‌లో శనివారం స్వచ్ఛంధ్రా జరిగింది. కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అధికారి ప్రభాకర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, సిబ్బంది పాల్గొన్నారు. 63వ డివిజన్ వృద్ధాశ్రమం వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని


నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మొక్క నాటుతున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): మనం పని చేసే ప్రదేశంతోపాటు, పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుదామని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. స్వర్ణ ఆంధ్రా–స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని శనివారం ఆమె చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత వస్తువులనే వినియోగిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, గణాంక అధికారి లక్ష్మోజీ, ఆఫీసు సూపరింటెండెంట్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాలప్రిన్సిపాల్, విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 26వ డివిజన్‌లో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, సతీష్ ఆధ్వర్యాన శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ స్పెషల్ ఆఫీసర్ వై నాగేశ్వరరావు ప్లాస్టిక్ వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సీకే రెడ్డి రోడ్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహనరావు ప్లాస్టిక్‌ను నివారిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, స్వచ్ఛ ఆంధ్ర ప్రోగ్రాం కన్వీనర్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై అవగాహన సదస్సు


విద్యార్థులు తయారు చేసిన వస్తువులతో ప్రదర్శన

మధురానగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగం మానుకుని ప్రత్యామ్నాయ వస్తువులు ఉపయోగించాలని సిద్ధార్థ మహిళ కళాశాల వృక్షశాస్త్ర విభాగం పూర్వ అధ్యాపకురాలు యు సుశీల సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళల డిగ్రీ కళాశాలలో శనివారం వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ విద్యార్థులు అనవసర ఆర్భాటాలు లేకుండా పర్యావరణ హితంగా ఉండే వస్తువులతో జీవించడం నేర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునే పర్యావరణహిత వస్తువులను తయారుచేసి ప్రశంసలు అందుకున్నారు. అవగాహన సదస్సులో సుధారాణి, సుమిత్ర, సత్యవాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన బాల్య వివాహాలపై అవగాహన సదస్సు జరిగింది. వాసవ్య మహిళా మండలి కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. 18 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రమే వివాహాలకు అర్హులని తెలిపారు. ఒకవేళ ఎవరైనా బాల్య వివాహాలు ప్రోత్సహించినట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందన్నారు. కావున విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకుని బాల్య వివాహాలు జరగకుండా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగీతార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వనిత సురేష్ బృందం శనివారం సంగీతార్చన నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై వనితి సురేష్ గాత్రకచేరీ భక్తులను విశేషంగా అలంకరించింది. వనిత సురేష్‌కు మల్లాది శివానంద్ మృదంగంపై, సింధు రాగేశ్వరి వయోలిన్‌పై వాద్య సహకారం అందించారు.

నూతన పింఛన్లు ఇవ్వాలి



63వ డివిజన్‌లో సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్ర

పాయకాపురం(విజయవాడరూరల్): కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వితంతు, వృద్ధాప్య, వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కే దుర్గారావు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం 63వ డివిజన్ సుందరయ్యనగర్, రజకవీధి వద్ద పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాదయాత్ర బృందానికి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. దుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ఏ మాత్రం శ్రద్ధవహించడం లేదని అన్నారు. పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పీ సాంబిరెడ్డి, ఎల్ నిర్మల, మునాఫ్ పటేల్, పీ జగన్ పాల్గొన్నారు.

23న ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం మహాసభ


పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తమ సంఘం 12వ నగర మహాసభను ఈ నెల 23వ తేదీన బందరురోడ్డు రాఘవయ్య పార్కు సమీపంలో ఉన్న మాకినేని బసవపున్నయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షుడు డీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడను ఆటోలకు ఎటువంటి ఆంక్షలు లేని ఫ్రీ జోన్‌గా చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఏవిధమైన పోరాటాలు చేయాలనే విషయాలపై ఈ మహాసభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు డీ శ్రీధర్‌బాబు, పింగళి రమణ, రఫీఖాన్, యాదగిరి, సుబ్బారావు, వలి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన


వినియోగదారుల హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు హక్కులను పరిరక్షించుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ నేలపూడి చిరంజీవి అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన వినియోగదారుల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వినియోగదారుల హక్కులను వివరించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుడు అక్కపెద్ది వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో కూడా వినియోగదారుల హక్కుల పరిరక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారుల హక్కుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేలపూడి చిరంజీవి, అక్కపెద్ది వెంకటరమణలను సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, కొరవటా నాగమల్లేశ్వరి, ఎస్‌కే షఫీ రహీమ, సభ్యులు హేమంత్‌రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా నగరోత్సవం


స్వామివారి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీవేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా సాగింది. కొత్తపేట వేణుగోపాలస్వామి చౌక్ (నెహ్రూబొమ్మ సెంటర్)లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా రెండురోజులుగా స్వామి సన్నిధిలో పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత కల్యాణవేదికపై సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలుని ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వివిధ ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర కార్యక్రమాలు కల్యాణోత్సవాన్ని ముగించారు. అదేవిధంగా స్వామివారికి శనివారం నగరోత్సవాన్ని నిర్వహించారు. రమణీయంగా అలంకరించిన వాహనంపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. అనంతరం స్వామి వారి నగరోత్సవాన్ని ప్రారంభించారు. నగరోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై బ్రాహ్మణవీధి, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉత్సవంలో భాగంగా ఆలయంలో వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఒడిశా యువతికి అరుదైన గుండె శస్త్రచికిత్స


మీడియా సమావేశంలో రోగితోపాటు వైద్య బృందం

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పుట్టుకతోనే క్లిష్టతరమైన గుండె సమస్యలున్న ఒడిశాకు చెందిన 26 ఏళ్ల యువతికి విజయవాడలోని ఆస్టర్ రమేష్ ఆస్పత్రిలో క్లిష్టతరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ భరత్ సిద్ధార్థ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్ జిల్లాకు చెందిన రీనాకు సెన్నింగ్ రిపేర్, కరక్టెడ్ ట్రాన్స్‌పొజిషన్ ఆఫ్ ది గ్రేట్ ఆర్టరీస్, గుండె రక్తప్రవాహ మార్గాలు తప్పుగా అనుసంధానమై ఉన్నట్లు గుర్తించారు. ఇలా పలు సమస్యలున్న యువతికి క్లిష్టతరమైన శస్త్రచికిత్సను 12 గంటల పాటు శ్రమించి విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇది అత్యంత అరుదైన శస్త్రచికిత్స అని తెలిపారు. సమావేశంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ జ్యోతిప్రకాష్, డాక్టర్ కే అనూష తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు





ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ముగిశాయి. విద్యార్థులు చివరి రోజు పరీక్ష రాసి కేంద్రాల సంతోషంతో కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. రెండేళ్లు కలిసిమెలసి ఉన్న విద్యార్థులు ఒక పక్క సంతోషంగా, మరోపక్క ఫ్రెండ్స్‌ను విడిచిపోతున్నామనే బాధతో సొంత ఊర్లకు పయనమయ్యారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ విద్యార్థులతో నిండిపోయింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

సెలవు రోజుల్లో పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీస్థలాలు, నీటి పన్ను చెల్లింపులు సెలవు దినాల్లో కూడా చెల్లించవచ్చని, క్యాష్ కౌంటర్లు అందుబాటులోనే ఉంటాయని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ పన్నులను వీఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్ని క్యాష్ కౌంటర్లలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు నగర ప్రజలు తమ తమ అసెస్మెంట్లకు ఉన్న పన్నులు త్వరితగతిన చెల్లించి, వడ్డీ లేకుండా సకాలంలో చెల్లించాలని కోరారు. ఎక్కువ కాలం నుంచి పన్నులు చెల్లించని వారికి డ్రెయినేజ్ కనెక్షన్, తాగునీటి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు.

27 నుంచి కంప్యూటర్ ట్రైనింగ్ సమ్మర్ క్యాంప్

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న కంప్యూటర్ ట్రైనింగ్ కేంద్రంలో ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మర్ కంప్యూటర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహించనున్నట్లు కంప్యూటర్ విభాగం ఇన్‌చార్జి టీ క్రాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, సీ లాంగ్వేజ్, కోరల్ డ్రా, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. 45 రోజుల పాటు క్లాసులు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు పూర్తవుతున్న నేపథ్యంలో వేసవి సెలవుల్లో కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీలోగా ఆసక్తి కలిగిన వారు రాఘవయ్య పార్కు సమీపంలోని తమ కార్యాలయంలో గానీ, 90145 41958, 73821 93413 నంబర్లలో గానీ సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన సదస్సు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఏసీడీపీఓ జ్యోత్స్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు ప్రీ–కాన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టం –1994పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కలిగించారు. ఈ చట్టం సమర్థవంతంగా అమలు అయ్యేలా ప్రతిఒక్కరూ తమవంతు పాత్రను పోషించాలని కోరారు. కార్యక్రమంలో శారద, గాయత్రి, టీ చందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీ విజయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'సక్సెస్ పోలీస్' పుస్తకావిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అమరావతి డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ తిప్పినేని రామదాసప్ప నాయుడు రచించిన ''సక్సెస్ పోలీస్'' పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. మాజీ హోం శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఇటీవల పదవీ విరమణ చేసిన మాజీ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు జీవిత చరిత్ర ఆధారంగా సక్సెస్ పోలీస్ పుస్తకాన్ని రాసినట్లు వివరించారు. అనంతరం అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల పరిరక్షణ చట్టం ప్రజా చైతన్యం అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. టీడీపీ నాయకులు పొసర్ల రమేష్, బీ మనోహరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేంచేసిన శ్రీ స్వయంబు శ్రీవల్లీదేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలలో భాగంగా తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం గోపూజ, 8గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, రక్షాబంధన, నవగ్రహ మండపారాధన, చతుర్ధ కలశ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద స్వామి వారిని అమ్మవార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమాలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతుల పర్యవేక్షణలో గాడే సురేంద్రరెడ్డి దంపతులు, మాజీ కార్పొరేటర్ కొరికాని అనురాధ, మల్లేశ్వరరావులతోపాటు ఉభయదాతలు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com